www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 మార్చి 2024

5



డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

ఆసుపత్రుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు అందులో పని చేసే వైద్యులు, స్టాఫ్ నర్స్ ల వివరాలను జిల్లా కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎం దుర్గారావు దొర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్ స్కానింగ్ కేంద్రాల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. లేని పక్షంలో ఆయా సెంటర్లు కొత్త రిజిస్ట్రేషన్ లతో పాటు రెన్యువల్ రిజిస్ట్రేషన్లను నిలిపి వేస్తామని తెలిపారు.

ప్రభుత్వ హాస్టల్లో సౌకర్యాల లేమి

- వర్షానికి లీకవుతున్న గదులు
- టాయిలెట్ల వద్దే భోజనాలు
- సమస్యలతో విద్యార్థుల సతమతం



డైనింగ్ హాల్ లేక టాయిలెట్ల వద్దే విద్యార్థుల భోజనాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండల కేంద్రంలోని ప్రభుత్వ హాస్టల్లో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉండటంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సుమారు 60 మంది విద్యార్థులు గల ఈ హాస్టల్ భవనం 2004లో నిర్మించారు. నిర్మించి 20 ఏళ్లు కావడంతో విద్యార్థులు నివసించే గదులు, డార్మెటరీల్లో వర్షం వస్తే ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి తోడు గదుల్లోని ఫ్యాన్లు అప్పుడప్పుడు తిరిగి కనీసం గాలి కూడా రాని పరిస్థితి నెలకొని ఉంది. ఇక టాయిలెట్లు 20 ఏళ్ల క్రితం నిర్మించడంతో పూర్తిగా అధ్వాన్నంగా మారాయి. మరి ముఖ్యంగా ఇక్కడ విద్యార్థులకు భోజనాలు చేసేందుకు డైనింగ్ హాల్ లేకపోవడంతో ఇక్కడ టాయిలెట్లు రూముల వద్ద దుర్గంధ భరితమైన ప్రాంతంలోనే విద్యార్థులు భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఆధునిక భవనం నిర్మించాలని, టాయిలెట్లను ఆధునీకరించాలని, విద్యార్థుల గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, భోజనాలు చేసేందుకు భోజన శాలను నిర్మించాలని, విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు.

దీనిపై హాస్టల్ వార్డెన్ అల్లిరెడ్డి శ్రీనివాసరావును వివరణ కోరగా 2004లో నిర్మించిన ఈ భవనం గదుల్లో వర్షం నీరు లీకవుతుందని, దీన్ని పైఅధికారుల దృష్టికి తీసుకుని వెళ్లామని చెప్పారు. ఫ్యాన్లు కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని, టాయిలెట్లు ఆధునీకరించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. విద్యార్థులకు భోజనశాల డైనింగ్ హాల్ లేకపోవడం వల్ల వర్షం వచ్చినప్పుడు భోజనాలు చేయాలంటే మరింత ఇబ్బందిగా ఉంటుందని, దాతలు ఎవరైనా భోజనశాలను విరాళంగా ఇస్తే బాగుంటుందని చెప్పారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన టాయిలెట్లు



రెక్కలు వంగిపోయిన ఫ్యాన్లు



వేగాయమ్మ పేట వద్ద నేలకొరిగిన చేలు

నేలకొరిగిన దాళ్వా వరి చేలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

బుధవారం కురిసిన అకాల వర్షంతో ఈదురు గాలులకు పలు దాళ్వా వరి చేలు నేల కొరిగాయి. ప్రస్తుతం దాళ్వా వరి చేలు పొట్ట దశను దాటి ఈనిక దశకు చేరుకున్నాయి. వాతావరణంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆకస్మికంగా ఈదురుగాలులు వర్షం కురవడంతో రైతులు ఆందోళన గురయ్యారు. పలుచోట్ల వరి చేలు నేలకొరగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాళ్వా పంటలకు రైతులు తొలకరి కంటే అధికంగా పెట్టుబడులు పెడతారు. ప్రస్తుతం ఎంతో ఆశాజనకంగా వరిచేలు ఉన్నాయి మరో నెలలో దాళ్వా వరి కోతలు కూడా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రతి ఏటా మే నెలలో తుఫానులు సంభవించి రైతులు నష్టం పాలవుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు వాతావరణం రైతులకు అనుకూలించింది. బుధవారం వర్షాలకు అక్కడక్కడా వరి చేలు నేలకొరిగినా భారీ నష్టాలు సంభవించలేదు. మరో నెల రోజులు గడిస్తే దాళ్వా రైతులు గట్టెక్కే అవకాశం ఉంది.

వేతనాలందని పారిశుధ్య వర్కర్లు

ప్రజాశక్తి-మండపేట

గత మూడు నెలల నుంచి వేతనాలు అందకపోవడంతో పాఠశాలలలో పని చేసే శానిటేషన్ వర్కర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మధ్యాహ్న భోజనపథకం, శానిటేషన్ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కొమ్ము సత్యవేణి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని 25 మండలాల్లో సుమారు 1,693 మంది పని చేస్తున్నారని, వీరికి గత జనవరి నెల నుంచి నేటి వరకు వేతనాలు అందలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబం గడవడం కష్టతరంగా మారిందన్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు గ్యాస్, నూనె, పప్పు తదితర వంట సామాగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో అప్పులు కూడా పుట్టడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న 2,646 మంది కార్మికులకు అడిషనల్ మెనూ పడాల్సి ఉందన్నారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల ప్రవర్తన నియమావళి పోలింగ్ ప్రక్రియపై అధికారులతో పాటుగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ ప్రక్రియ, నామినేషన్లను దాఖలు చేసే విధానం, సువిధ, సివిజిల్ యాప్‌ల ద్వారా దరఖాస్తు చేసే విధానం తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ఆర్‌ఒలకు, నోడల్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఓటర్లలో స్ఫూర్తిని నింపి ఓటింగ్ శాతాన్ని పెంచే లక్ష్యంతో క్రమబద్ధమైన ఓటరు విద్య ఎన్నికల భాగస్వామ్యం పేరిట (స్వీప్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ర్యాంపులు, నేమ్ బోర్డులు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో హెల్ప్ డెస్క్ ఎండ నుంచి రక్షణ కోసం షామియానాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పోలింగ్‌పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియ మొదలవ్వడానికి 90 నిమిషాల ముందే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని చెప్పారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివి ప్యాట్లను కలిపి ఒక ఇవిఎం యూనిట్‌గా పరిగణిస్తారని, వీటిలో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్కటి పని చేయకపోయినా మొత్తం యూనిట్ మారుస్తారని తెలిపారు. ఒక్క వివి ప్యాట్‌లో ఏమైనా సమస్య తలెత్తితే మాత్రం, ఆ ఒక్క దానినే మారిస్తే సరిపోతుందని తెలిపారు. ఇవిఎంలతోపాటు టెండర్, ఛాలెంజ్ ఓట్లను కూడా ప్రతీ పోలింగ్ బూత్‌కు ఇస్తామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో క్యూలైన్ల నిర్వహణ, తెలియని వారికి సహాయం చేసేందుకు ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, స్కౌట్ విద్యార్థులను నియమిస్తారని చెప్పారు. ఈ ఎన్నికల్లో కొత్తగా 'హోమ్ ఓటింగ్' విధానాన్ని ఎన్నికల కమిషన్ ప్రవేశ పెట్టిందన్నారు. దీనికోసం ముందు గానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వయసు 85 ఏళ్లు పైబడినవారు. 40 శాతం వికలాంగత్వం ఉండి సదరం ధ్రువపత్రం కలిగిన వికలాంగులు, కోవిడ్ వ్యాధిగ్రస్తులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందన్నారు. ఏజెంట్లు ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉన్నవారిని నియమిస్తే మంచిదని సూచించారు. రాజకీయ పార్టీలు తమ పోలింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డు తప్పనిసరి అని చెప్పారు. అత్యవసర సేవ ఉద్యోగుల కోసం మూడు రోజుల పాటు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారని చెప్పారు. పార్లమెంటు స్థానం కోసం పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ స్థానంలో పోటీ చేసే అభ్యర్థి గరిష్ఠంగా రూ.40 లక్షల వరకు ఖర్చు చేసుకొనే అవకాశం ఉందన్నారు. దీనికోసం అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంక్ ఖాతాను ప్రారంభించి ఆ యొక్క వివరాలను అందజేయాల్సి ఉందన్నారు. ఎన్నికల తరువాత నిర్దేశ గడువులోగా ఖర్చుల వివరాలను తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు చేసే ఖర్చుపై వ్యయ పరిశీలకులు నిఘా ఉంటుందని, వీడియో రికార్డింగ్ కూడా చేస్తారని తెలిపారు. ఫిర్యాదుల కోసం 24 గంటలూ పనిచేసే కంప్లయింట్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు 365 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-ముమ్మిడివరం

పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఇంగ్లీష్ పరీక్షకు 365 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. జిల్లావ్యాప్తంగా 112 కేంద్రాల్లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 19,346 మందికి బుధవారం 18,981 మంది హాజరయ్యారన్నారు. డిఇఒ కమల కుమారి ముమ్మిడివరం బాలికల గురుకుల పాఠశాల, జెడ్‌పి బాలుర పాటశాలల్లో, డివైఇఒ అమలాపురం, రామచంద్రాపురం డివిజన్లతో పాటు అనాతవరం ప్రభుత్వ పాఠశాలలో ఎన్.ఫణి, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ముమ్మిడివరం మండలంలో రెగ్యులర్ మరియు ప్రైవేట్ విద్యార్థులు 733 మందికి 722 మంది హాజరు కాగా 11 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉప్పలగుప్తం ఎంపిపి పాఠశాలలోని భవిత సెంటర్‌లో గురువారం డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం శ్యామల అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంఇఒ ఎస్.సత్యకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొనగా ఐఇఆర్‌టిలు గంగాదేవి, వెంకటేష్ డౌన్ సిండ్రోమ్ గురించి వివరించారు. డౌన్ సిండ్రోమ్ రావడానికి ప్రధాన కారణాలు వచ్చిన వారికి భవిత కేంద్రంలో అందించే సేవలపై అవగాహన కల్పించారు. విద్యాశాఖాధికారి సత్య కృష్ణ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న సమాజానికి డౌన్ సిండ్రోమ్ పట్ల అవగాహన కల్పించి తోడ్పాటు అందించాలని తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



సమావేశంలో మాట్లాడుతున్న డిబి.లోక్

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) రాష్ట్ర అధ్యక్షుడు డిబి లోక్ కోరారు. గొల్లవిల్లిలో గురువారం ఆర్‌పిఐ మండల అధ్యక్షుడు పండు రాజేష్ అధ్యక్షతన జరిగిన పార్టీ సమావేశంలో లోక్ మాట్లాడారు. ప్రస్తుతం భారత రాజ్యాంగాన్ని కొన్ని మతతత్వ కులతత్వ వాదుల పార్టీలు మార్చాలని ప్రయత్నిస్తున్నాయని ఆ ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఇటీవల బిజెపి నేత హెగ్డే దేశంలో తమ పార్టీకి మూడు వంతుల మెజార్టీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని ప్రకటించడం దేశ మనుగడకు ముప్పు వాటిల్లుతున్నదనేదానికి నిదర్శనమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆర్‌పిఐ పోటీ విషయంలో అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. త్వరలో పార్టీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తుందని తెలిపారు. త్వరలోనే తమ పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు. మండలంలోని శివారు గ్రామాలకు తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నూతన కమిటీ అధ్యక్షునిగా దారా బాలకృష్ణను నియమించారు. ఈ సమావేశంలో ఆర్‌పిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెయ్యల పరశురాముడు అల్లవరం మండల అధ్యక్షులు యల్లమిల్లి అఖిల్, పార్టీ సీనియర్ నాయకులు కొంకి వెంకటబాబ్జి, కందికట్ల ప్రకాష్, మట్టా కిషోర్, దోనిపాటి కృష్ణమూర్తి, రెడ్డి పాల్గొన్నారు.



దాత బాలాజీ బహుకరించిన ఫర్నిచర్

దాత బాలాజీ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పి.గన్నవరం

పోతవరం పంచాయతీకి మౌలిక సదుపాయాలు సమకూర్చిన దాత బాలాజీ సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ వడలి కొండయ్య, గ్రామ ప్రజలు ధన్యవాదములు తెలిపారు. మెట్రో క్రెమ్ ఎపిఐ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత డాక్టర్ నందెపు వెంకటేశ్వరరావు (బాలాజీ) రూ.2 లక్షల విలువైన ఫర్నిచర్ బహూకరించారని గురువారం సర్పంచ్ కొండయ్య తెలిపారు. అంతేకాక పంచాయతీ ఎదురుగా ఖాళీ స్థలంలో రూ.3 లక్షల వ్యయంతో ఐరెన్ షెడ్డు వేస్తామని దాత ప్రకటించారన్నారు. గ్రామాన్ని మరింత మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు.

కూటమి అభ్యర్థిని గెలిపిస్తాం: బోళ్ల

ప్రజాశక్తి-రాజోలు

రానున్న ఎన్నికల్లో ప్రత్యర్థి ఎవరైనా రాజోలు నియోజకవర్గం నుంచి టిడిపి, జనసేన, బిజెపి కూఐటమి అభ్యర్థిని గెలిపిస్తామని టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బోళ్ల వెంకట రమణ అన్నారు. తాటిపాకలోని గురువారం ఆయన విలేకరులతో ఆయన మాట్లాడారు. రాజోలు నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి ఎవరైనా విజయం మాత్రం కూటమి అభ్యర్థిదేనన్నారు. పార్టీలో అందరూ పొత్తు ధర్మాన్ని ఆమోదించాల్సిన అవసరం ఉందన్నారు.

ఓటు ప్రజాస్వామ్య పరిరక్షణ ఆయుధం

ప్రజాశక్తి-అమలాపురం

ఓటుతో దేశ భవిష్యత్తు నిర్దేశితం అవుతుందని దేశ భవిష్యత్తును మార్చేది ఓటేనని డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో క్రమబద్ధమైన ఓటరు విద్య ప్రజాస్వామ్యంలో ఓటర్ల భాగ స్వామ్యం (స్వీప్) అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను చాటి చెప్పే రీతిలో రూపొందించిన రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఓటే ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయుధమని ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలంటూ డ్వాక్రా సంఘాల మహిళలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ. ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని తెలిపారు. దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని చెప్పారు. అర్హులైన వారు తమ ఓటును నమోదు చేయించుకుని వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో అందరూ ఓటు వేయాలన్నారు. మద్యం, డబ్బు, బహుమతులు వంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. భారత పౌరులుగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తద్వారా ఓటు హక్కును సక్రమంగా విని యోగించుకోవాలని చెప్పారు. మహిళలు యువత ఓటు హక్కు పట్ల అవగాహన కలిగి బాధ్యతాయుతంగా వ్యవ హరించి తమ ఓటు విలువను తెలుసుకుని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ప్రజా స్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ప్రధాన ఆయుధమని, అటువంటి ఓటు హక్కును బాధ్యతాయుతంగా నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని పిలుపు నిచ్చారు. ఇవిఎం యంత్రాల ద్వారా ఓటు వేసే విధానంపై పోలింగ్ కేంద్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. యువత ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రతి ఒక్కరికీ ఓటు చాలా ముఖ్యమైనదని ఓటు ద్వారానే సమాజానికి మంచి చేసే ప్రజా ప్రతినిధులను అందించే అవకాశం ఉందని తెలిపారు. యువతలో అనంతమైన శక్తి దాగి ఉంటుందని, దాన్ని ఆలోచించుకోగలిగే శక్తి యువతలో ఉందని, ఒక్క ఓటుతో ఫలితాలు మారిపోతుందని అందుకే ఓటు హక్కును ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు వి.శివశంకర్, ప్రసాద్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎస్ మధుసూదన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారిని ఎం ఝాన్సీ రాణి,సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ మధు సూదన రావు, డ్వాక్రా మెప్మా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు

రామకృష్ణారావుకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి-కాట్రేనికోన

అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ప్రముఖ హైకోర్టు న్యాయవాది ముషిణి రామకృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ ముమ్మిడివరం నుండి గాని కొత్తపేట నుంచి గానీ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇస్తే అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని బిసి నాయకులు చెప్పారు. రామకృష్ణారావు ముమ్మిడివరం, కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం అధిష్టానానికి దరఖాస్తు చేసినట్టు తెలిపారు. ఆయన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కట్టా శ్రీనివాస రావు, ఎం.శివప్రసాద్ వాసంశెట్టి జగదీశ్, రెడ్డి త్రిమూర్తులు, యెల్లమిల్లి వెంకటేశ్వరరావు, దొమ్మేటి వెంకట్, కడలి సత్యనారాయణ, వై.ధనరాజు, మేడిశెట్టి సురేష్, గుత్తుల నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

తాపేశ్వరంలో 'నేనున్నాను మీకోసం'

మండపేట : తాపేశ్వరంలో నేనున్నాము మీకోసం కార్యక్రమంలో భాగంగా నవతరం పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి నందికోళ్ల రాజు గురువారం పర్యటించారు. పాలన మారాలి పాలకులు మారాలి అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఏం చేసాయో తేడా చూసి ప్రధానంగా యువతీ యువకులు, ప్రజలు గమనించాలన్నారు. తాపేశ్వరం రోడ్డు నేటికీ పూర్తిగాకపోవడం వాహనదారులు పడుతున్న ఇబ్బందులు నేపథ్యంలో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు పూర్తికాకుండానే ఎలా ప్రారంభించారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండపేట నుండి ఏడిద వెళ్లే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు.

23 నుంచి 30 వరకూ భగత్ సింగ్ వర్ధంతి సభలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఈ నెల 23 నుంచి 30 వరకూ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 93వ వర్ధంతి సభలను నిర్వహించాలని పిడిఎస్‌యు, పివైఎస్ నాయకులు బి.సిద్ధూ, వి.భీమ శంకర్ పిలుపు ఇచ్చారు. స్థానిక ఎస్‌సి అంబేద్కర్ బాయ్స్ కళాశాల వసతి గృహంలో గురువారం భగత్ సింగ్ వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. బి.సిద్ధూ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను స్మరించుకుంటూ సభలు, సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని, భగత్ సింగ్ జీవిత చరిత్ర పాఠ్యాంశంగా చేర్చాలని, పౌరసత్వ చట్ట సవరణ (సిఎఎ)ను రద్దు చేయాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని, విద్య, ఉపాధి కోసం ఉద్యమించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. రామచంద్రపురం, ద్రాక్షారామ, గంగవరం, మండపేట తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ ఉమ్మడి జిల్లా నాయకులు వి.భీమశంకర్, అంబటి కృష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు చింతా రాజారెడ్డి, విద్యార్థులు పి.ఉదయ్ కిరణ్, సిహెచ్.దుర్గాప్రసాద్. ఎం.అశ్వాన్, అజయ్ పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'



థాయ్ బాక్సింగ్ ఛాంపియన్ అశోక్‌కు సత్కారం

ప్రజాశక్తి-రాజోలు



థాయ్ బాక్సింగ్ ఛాంపియన్ అశోక్‌కు సత్కారం

ఇంటర్నేషనల్ థాయ్ బాక్సింగ్ చాంపియన్ కొల్లాటి అశోక్ కు గురువారం మహాగజమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోంపల్లి ఏఎమ్ఎస్ సెంటర్ వద్ద ఘన సత్కారం చేశారు. ఈ కార్యక్రమాని ఆంధ్రరత్న అంతర్జాతీయ యోగా,బాక్సింగ్ రిఫరీ చుట్టూరి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా నిజాం పట్నంకు చెందిన అశోక్ 2024 మార్చి నెలలో థాయిలాండ్ లో జరిగిన ఇంటర్నేషనల్ దాయ్ బాక్సింగ్ పోటీల్లో ఇండియా తరుపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించాడని అన్నారు.2028 లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో థాయ్ బాక్సింగ్ ను చేర్చారని దీనివల్ల ఇండియా తరుపున ఎక్కువ మంది క్రీడాకారులు పాల్గొనవచ్చు అని అన్నారు. అశోక్ ఒలింపిక్స్ లో పాల్గొని పతకాలు సాధించి మన దేశానికి పేరు తేవాలని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ థాయ్ బాక్సింగ్ క్రీడాకారుదు అశోక్ మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు మహాగజమాల ఫౌండేషన్ సభ్యులు తనను సత్కరించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఒలింపిక్ లో పతకం సాధించడమే తన ధ్యేయం అని అన్నారు. ఈకార్యక్రమంలో ఇంటర్నేషనల్ యోగా గురువు మల్లాడి నారాయణ, గజమాల యాత్ర వ్యవస్థాపకుడు చింతా మహా నాగరాజు,సాఫ్ట్ వేర్ సొల్యూషన్ సెంటర్ చైర్మన్ తారాడి జీవన్ కుమార్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తిరుమాని ఆచార్య, రాజోలు తాలూకా అధ్యక్షుడు ఇల్లింగి వెంకట రమణ,మల్లాడి నగేష్ పాల్గొన్నారు.

అంజు ఆసుపత్రి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి -మామిడికుదురు



శిబిరాన్ని ప్రారంభిసున్న డాక్టర్ తేజ, స్వామి

అంజు ఆసుపత్రిలో పేదలకు ఉచిత ఆపరేషన్ సేవలు అభినందనీయమని ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్ముల వెంకట సత్యనారాయణ స్వామి అన్నారు. అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఫౌండేషన్, కాకినాడ, విజన్ ఫర్ అల్ స్విట్జర్లాండ్ ఆధ్వర్యంలో మామిడికుదురులో అంజు కంటి ఆసుపత్రి ఆవరణలో గురువారం నిరుపేదలకు ఉచితంగా కంటి శుక్లం ఆపరేషన్స్‌ను తేజ ప్రారంభించారు. వృద్ధాప్యంలో వచ్చే లెన్స్ మార్పు వల్ల శుక్లాలు వస్తాయని తెలిపారు. విజన్ ఫర్ అల్ స్విట్జర్లాండ్ సహాయంతో అంజు ఐ కేర్ ఫౌండేషన్ వారు అంజు కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేస్తామని తెలిపారు. డాక్టర్ ఆండ్రే మెరమండ్ మాట్లాడుతూ సంవత్సరానికి 1500 ఆపరేషన్ల విజన్ ఫర్ అల్ -స్విట్జర్లాండ్ తరపున ఉచితంగ చేస్తామని తెలిపారు. మోరి కూడా ఐకేర్ ఆసుపత్రి నిర్వహిస్తున్నామని చెప్పారు. వివరాల కోసం అంజు కంటి హాస్పిటల్- స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ఎదురుగ మామిడికుదురులో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ తేజ, డాక్టర్ ఆండ్రే మెరమండ్, డాక్టర్ సత్యనారాయణ స్వామి, డాక్టర్ విజయ లక్ష్మి, డాక్టర్ లత, డాక్టర్ రూహి, మేనేజర్ స్వామి వందనం, భరత్, సూర్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేడెక్కిన రాజోలు రాజకీయం

మారుతున్న రాజకీయ సమీకరణాలు
మాజీ మంత్రిని ఢీ కొట్టనున్న మాజీ ఐఎఎస్
గెలుపుపై ఇరుపార్టీల ధీమా

ప్రజాశక్తి- రాజోలు


అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కాయి. జిల్లాలో చివరి నియోజకవర్గం రాజోలులో రాజకీయం ఆసక్తికరంగా మారింది. కొద్ది రోజులుగా నియోజకవర్గాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్న వైసిపి అధిష్టానం రాజోలు సీటుపై క్లారిటీ ఇచ్చింది. 2019 ఎన్నికలలో జనసేన నుంచి పోటీ చేసి గెలిచిన రాపాక వరప్రసాదరావుకు అవకాశం ఇవ్వకుండా మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు టిడిపిని వీడి వైసిపిలోకి చేరడంతో ఆయనకు సీటు ఇచ్చారు. రాజకీయ బద్ధశత్రువులైన రాపాక, గొల్లపల్లి ఒక్కటై 2024లో ఒకరు ఎంఎల్ఎగా మరొకరు అమలాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారు.

గెలుపై వైసిపి ధీమా

2014 సార్వత్రిక ఎన్నిల్లో రాజోలులో టిడిపి అభ్యర్థిగా గెలిపొందిన గొల్లపల్లి సూర్యారావు 2019లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. మరలా 2024లో టిడిపి నుంచి సీటు ఆశించినప్పటికీ పొత్తులో భాగంగా తనకు సీటు ఇవ్వకపోవడంతో వైసిపిలో చేరిన గొల్లపల్లి కొద్ది రోజుల వ్యవధిలోనే రాజోలు ఎంఎల్ఎ అభ్యర్థిగా సీటు తెచ్చుకుని తన రాజకీయ ఎత్తుగడకు తెరలేపారు. మొదట గొల్లపల్లికి రాపాక సహకారం లేకపోవడం మిగిలిన అసంతృప్తి వర్గం గొల్లపల్లికి జై కొట్టడంతో అధిస్టానం ఆదేశాల మేరకు రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ కూడా గొల్లపల్లిని గెలిపించాలని అన్ని మండలాల శాఖలకు సమాచారం ఇవ్వడంతో వైసిపి కేడర్ మొత్తం ఒకతాటి పైకి వచ్చింది. దీనికి తోడు రాజోలు నియోజకవర్గంలో పదేళ్లుగా గొల్లపల్లి సుపరిచితుడు కావడం ఆయనకు కలిసి వచ్చే అంశంగా చెబుతున్నారు.

జనసేన పార్టీలో వర్గపోరు...!

రాజోలు నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థి రాపాక వరప్రసాద్ గెలవడం రాష్ట్రంలో ఒకే ఒక్క సీటు రాజోలు కావడంతో రాజోలు నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం పొత్తు నేపథ్యంలో జనసేనకు సీటు కేటాయించడంతో ఆ పార్టీ అభ్యర్థిగా రిటైర్డ్ ఐఎఎస్ దేవ వరప్రసాద్ పేరును ప్రకటించారు. దీంతో జనసేన పార్టీలో వర్గపోరు మొదలైంది. టికెట్ ఆశించి వైసిపి నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓడిపోయిన బొంతు రాజేశ్వరరావు తన వర్గం బొంతుకే సీటు కేటాయించాలని చేసిన రచ్చ ఇంతా అంతా కాదు. నాలుగేళ్ల నుంచి పార్టీలో పని చేస్తు జనసేనకు మైలేజీ తీసుకొచ్చిన చింతలమోరి సర్పంచ్ డాక్టర్ రమేష్ బాబు తనకు సీటు వస్తుందని ఆశించారు. అధిస్టానం ఎ.నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని తెలుపడంతో రమేష్ బాబుపై పార్టీలో సానుకూలంగా ఉన్నారు. ప్రత్యర్థి రాజకీయ కురవద్ధుడు గొల్లపల్లిని ఢీ కొట్టాలంటే టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థికి వర్గపోరు లేకుండా ఉంటేనే 2019 ఫలితం పునరావృతమవుతుందని అంటున్నారు.


గొల్లపల్లి సూర్యారావు


దేవ వరప్రసాద్

నేరాలు ఘోరాలు

స్పా సెంటర్‌పై పోలీసుల దాడి

ప్రజాశక్తి - కాకినాడ

బాడీ మసాజ్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఈశా స్పా సెంటర్‌పై పోలీసుల బుధవారం అర్ధరాత్రి దాడి నిర్వహించారు. దీనికి సంబంధించి టూ టౌన్ సిఐ తెలిపిన వివరాలు..స్థానిక భానుగుడి జంక్షన్ ప్రాంతంలో కోటగిరి సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఈశా స్పా సెంటర్‌లో వ్యభిచారం జరుగుతుందనే సమాచారం రావడం జరిగిందన్నారు. దీంతో బుధవారం రాత్రి దాడి చేయగా కోల్‌కత్తాకు చెందిన ఒక మహిళ, ఇద్దరు విటులు, ఇద్దరు స్పా సెంటర్ నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గురువారం కోర్టుకు తరలించగా ఈశా స్పా సెంటర్ నిర్వాహకులను 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించారన్నారు. స్పా, బ్యూటీ పార్లల్, సెలూన్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందని క్రాస్ మసాజ్, వ్యభిచారం చేసేవారికి చట్టప్రకారం జైలు తప్పదని ఆయన హెచ్చరించారు.

కోడిపందేలపై దాడులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని వసంతవాడ, ఆత్రేయపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ గురువారం తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.900, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. ఆత్రేయపురం గ్రామ శివారున ఒకరిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.600, ఒక కోడి, కోడి కత్తులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్టు ఎపై తెలిపారు.


యంత్రాన్ని అందజేసిన విద్యార్థులు

నీటి శుద్ధి యంత్రం అందజేత

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండల పరిధిలోని మాచర జెడ్‌పి ఉన్నత పాఠశాలకు గురువారం నీటి శుద్ధి యంత్రాన్ని విద్యార్థులు బహూకరించారు. అదే పాఠశాలలో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు సుమారు రూ.10 వేల విలువ గల నీటి శుద్ధి యంత్రాన్ని పాఠశాలకు అందజేశారు. ఆ యంత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులను అభినందించారు.



ఆర్థిక సాయం అందిస్తున్న నామన కుటుంబికులు

నామన ఫౌండేషన్ ఆధ్వర్యాన వికలాంగులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -మామిడికుదురు

మగటపల్లిలో నామన ఫౌండేషన్ సౌజన్యంతో నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం మగటపల్లి వద్ద గురువారం రోగులకు ఆర్థిక సాయం అందించారు. వికలాంగులకు ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, బోర్డు మెంబర్స్ ఒకొక్కరికీ రూ.5 వేల చొప్పున 9 మందికి రూ.45 వేల సహాయం అందజేసారు. నాగుల్లంక వృద్ధాశ్రమంలో రూ.21 విలువ చేసే 8 నూతన మంచాలు, రూ.10 వేల విలువైన 10 ట్రంకు పెట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నామన వినోద్, శతి, తిరుమల సీతా మహాలక్ష్మి, బొలిసెట్టి జయరామ్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న కెయిర్న్ అధికారులు

ఎస్.యానాంలో ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.యానాంలో గురువారం ప్రపంచ అటవీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వేదాంత కెయిర్న్ ఆయిల్ కంపెనీ సహకారంతో మిత్ర హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ ఎస్ఎం పాషా, ఎఒ సోమన్‌దేవ్ సివిల్ ఇంజనీర్ కె.మహేష్, పాఠశాల హెచ్‌ఎం బి.అప్పారావు, కో ఆర్డినేటర్ బీర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-మండపేట

ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో పలువురు గురువారం టిడిపిలో చేరారు. పడమరఖండ్రిక గ్రామానికి చెందిన వైసిపి నేతలు పెట్టెం చంద్రావతి, పెట్టెం సుబ్బారావు, తుట్టపు రామకృష్ణ, కొమ్మిశెట్టి సురేంద్ర, బొర్రా కృష్ణ కిషోర్, కొమ్మిశెట్టి నాగేశ్వరరావు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి ఎంఎల్ఎ జోగేశ్వరరావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ ఎస్‌సి సెల్ కో ఆర్డినేటర్‌గా నీతిపూడి

ప్రజాశక్తి -మామిడికుదురు

నగరానికి చెందిన సీనియర్ నాయకులు నీతిపూడి బాల సత్యనారాయణను ఎపి కాంగ్రెస్ ఎస్‌సి సెల్ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ అధిష్టానం గురువారం నియామక ఉత్తర్వులు విడుదల చేసింది. ఆయన పార్టీ మండల ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా పని చేసారు. తన నియామకానికి సహకరించిన ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, పిసిసి అధ్యక్షులు షర్మిళ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, డిసిసి అధ్యక్షుడు కామన ప్రభాకర్ తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నీతిపూడికి పార్టీ శ్రేణులు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు శ్రీను, మహమ్మద్ ఆరిఫ్, మాచవరపు శివన్నారాయణ, వడ్డే నాగేశ్వరావు, ఒంటెద్దు బాబీ, వాకపల్లి రాంబాబు, అప్పన శ్రీరామకృష్ణ, నల్లి వెంకటరమణ, చిట్టాల జోగేశ్వరరావు శర్మ, ములపర్తి మోహనరావు, సరోజినీ దేవి, గెడ్డం వెంకటేశ్వరరావు, వనరాసి దుర్గారావు అభినందించారు.


ఎస్ సి సెల్ కో ఆర్డినేటర్ నీతిపూడికి సత్కారం

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన చుట్టుగుళ్ల పుణ్యవతి, శ్రీను, తవిటిక దుర్గాదేవి, కృష్ణ కుటుంబాలకు చెందిన ఇళ్లు గురువారం అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయాయి. ఆ కుటుంబాలు సర్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఆంధ్ర సేవారత్న, నేషనల్ అవార్డ్ గ్రహీత కరాటం ప్రవీణ్ బాధిత కుటుంబాలను పరామర్శించి తక్షణ సాయంగా రూ.5 వేలు నగదు, నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు అందజేశారు. తాండవపల్లి సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు బియ్యం, కాయగూరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న, శ్రీవెంకటేశ్వరా డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.నరసింహారావు, ప్రిన్సిపల్ కె.మనోహర్, కె.శ్రావణ్ దిలీప్, డాక్టర్ కరాటం హేమవిజిత, నల్లా సతీష్ పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న ప్రవీణ్ ఏసుబాబు

టిడిపిలో ముస్లిములకు పెద్దపీట

ప్రజాశక్తి-మండపేట

టిడిపి హయాంలోనే ముస్లిములకు పెద్దపీట వేశారని పార్టీ మైనారిటీ నాయకులు ఎండి.అల్తాఫ్, ఎస్.కె.ఇబ్రహీం, సల్మాన్ హుస్సేన్, ఎండి.కరీం, ఎస్.కె.కరీం, ఎస్.కె.కస్మూర్ బాబు, ఎస్‌కె.మదీనా, జెకె.బిలాల్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఎల్ఎ వేగుళ్ల కుటుంబం నియోజకవర్గంలో ముస్లిములను ఆదరించి అన్ని విధాలా ఆదుకుందన్నారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ముస్లిములకు ఇచ్చే అనేక పథకాలను రద్దు చేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో ముస్లిములకు ఏం చేసిందో చెప్పాలన్నారు.

వైసిపిలో పలువురి నాయకుల చేరిక

రామచంద్రపురం : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం 100 మంది ముస్లిం యువకులు ఆ పార్టీలో చేశారు. పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి అయిన పిల్లి సూర్య ప్రకాష్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడారు. ముస్లిం మైనార్టీల సమస్యలను వైఎస్ఆర్ ప్రభుత్వం పరిగణనలోనికి తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిందని వివరించారు. మతతత్వ పార్టీల కంటే వైసిపి ప్రభుత్వం మైనార్టీలకు అండగా నిలుస్తుందని ఆయన వివరించారు. ముస్లిం యువకులు పార్టీలో చేరటం చాలా ఆనందంగా ఉందని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు శ్రీనివాసరాజు, పెంటపాటి శ్రీను పాల్గొన్నారు.


పార్టీలో చేరిన ముస్లిం యువకులు


మేట్లకు శిక్షణా తరగతిలో మల్లికార్జున్

పారదర్శకంగా పని చేయించాలి

ప్రజాశక్తి-కొత్తపేట

ఏప్రిల్ ఒకటి నుంచి ఎంజిఎన్ఆర్‌జిఎస్ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మేట్లు పారదర్శకంగా పని చేయాలని ఎపిడి జివికె.మల్లికార్జునరావు అన్నారు. మేట్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం స్థానిక ఎన్ఆర్‌జిఎస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ మే జూన్ నెలల్లో 12 వారాలు పని దినములు కల్పిస్తారన్నారు. మేట్లు గ్రామంలో కొలతల ప్రకారం పని చేయించాలని, పనికి తగ్గ వేతనం మంజూరయ్యే విధంగా ఉండాలని అన్నారు. నేషనల్ మొబైల్ మేనేజ్మెంట్ సిస్టంలో పనికి రాగానే మొదట ఫొటో అప్లోడ్ చేయాన్నారు అనంతరం నాలుగు గంటల వ్యవధిలో మరో ఫొటో ఓపెన్ చేయాలన్నారు. అప్పుడు మాత్రమే అప్లయ్ అవుతుందన్నారు. ఒకవేళ సాంకేతిక లోపాల వల్ల పడకపోతే వేతనం లేనట్లేనని తగు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కె.వాణి, ఎపిడిసిబి జి.కవిత, ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, సిఒలు ఫణి కుమార్, భారతి, ఫీల్డ్ అసిస్టెంట్లు వాడ ప్రకాష్, చప్పిడి శ్రీహరి, కోటిపల్లి సత్యనారాయణ, కె.శేషగిరిరావు, సిహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజా సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కామనగరువు గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎఎస్ విఎస్ఎస్ రాజేశ్వరరావు సేవలు ప్రశంసనీయమని మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ ప్రశంసించారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఆయన పుట్టినరోజు సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు జరిపారు. సర్పంచ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది కార్యదర్శి రాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

యానాం వార్తలు


కీర్తి పురస్కారం అందుకుంటున్న దేవదానం రాజు

కీర్తి పురస్కారం అందుకున్న దాట్ల

ప్రజాశక్తి - యానాం

ప్రముఖకవి, కథకుడు దాట్ల దేవదానంరాజుకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన సభలో సృజనాత్మక సాహిత్యంలో 'దాట్ల'కు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. సభలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య టి.కిషన్‌రావు, మెట్రో రైల్ ఎండి ఎన్‌విఎస్.రెడ్డి, రిజిస్ట్రార్ భట్టు పురస్కారాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా దాట్లకు ప్రముఖకవి శిఖామణి, కవులు ముమ్మిడి చిన్నారి, పొనుగుమట్ల అశోక్‌కుమార్ అభినందనలు తెలిపారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సతీమణి లక్ష్మీ స్నేహ

వైభవంగా వెంకన్న కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి - యానాం

మీసాల వెంకన్న కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. గురువారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవంలో మహోత్సవంలో ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా యానాం ప్రజల పక్షాన ఎంఎల్ఎ దంపతులు స్వామికి ముత్యాల తలంబరాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ కుటుంబీకులు, భక్తులు పాల్గొని స్వామి కళ్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.


హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరాలయానికి రూ 10.44 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం ద్రాక్షారామ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. ఫిబ్రవరి 15 నుండి మార్చి 21 వరకు హుండీల ద్వారా రూ.10 లక్షల 44 వేల ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ పితాని తారకేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు, దేవాదాయ శాఖ తనిఖీదారు బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ అర్చకులు దేవస్థానం సిబ్బంది, తాపేశ్వరం నుండి వచ్చిన సేవా సంఘం భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాకినాడలో రాజకీయ వేడి

- **రేసులో సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి**
- **కూటమి అభ్యర్థిపై కొనసాగుతున్న ఉత్కంఠ**
- **గెలుపు గుర్రం ఎవరో..?**
- **అందరి చూపు సిటీ నియోజకవర్గంపైనే**

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

అతి సామాన్యుడి నుంచి ధనవంతుడి వరకు అందరూ హాయిగా బతకగలిగే నగరంగా, పెన్షనర్స్ పారడైజ్‌గా పిలువబడే కాకినాడ సిటీలో రాజకీయాలు కాక పుట్టిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఇక్కడి రాజకీయం మరింత హీటెక్కింది. అధికార, ప్రతిపక్షాలు వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే లక్ష్యంగా వ్యూహాలు పన్నుతున్నారు. మరోసారి పట్టు నిలుపుకోవాలని అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తుండగా అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడాలని ప్రతిపక్షాలు ఎత్తులు వేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల ముంగిట ముందుగానే వైసిపి అధిష్టానం అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సిట్టింగ్ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి మళ్లీ బరిలో నిలుచుంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నుంచి అభ్యర్థి ఇంకా ఎవరనేది స్పష్టత రాలేదు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందుతుందో అదే పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అనేది నానుడి. గత ఎన్నికల్లో 19కి గానూ 15 స్థానాల్లో వైసిపి విజయదుందుభి మోగించింది. ఫలితంగా వైసిపి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను సాధించి మళ్లీ పాగా వేయాలని వైసిపి వ్యూహరచన చేస్తోంది. ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుని అధిక స్థానాలను సాధించాలని టిడిపి, జనసేన, బిజెపి కూటమి పావులు కదుపుతోంది. దీంతో కాకినాడ సిటీ నియోజకవర్గం రాజకీయాలు ఆశక్తికరంగా మారాయి. ఈ నియోజకవర్గంలోని 233 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,13,177 మంది పురుషులు, 1,23,166 మంది స్త్రీలు, 94 మంది ఇతరులు మొత్తంగా 2,36,437 మంది ఓటర్లున్నారు. ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో కాకినాడ జిల్లా కేంద్రానికి ప్రత్యేకత సంతరించుకుంది.

గెలుపు గుర్రం ఎవరో..?

సిటీ నియోజకవర్గంలో అధికార పార్టీ నుంచి ఉన్న ఎంఎల్ఎ ద్వారంపూడి సిఎం జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో ఆయన్ను ఢీకొట్టే బలమైన అభ్యర్థి కోసం టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రయత్నాలు చేస్తోంది. ద్వారంపూడి గత కొంతకాలంగా రాష్ట్రవ్యాప్తంగా వార్తల్లోకి ఎక్కారు. ఆయనపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలతో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో జరిగిన వారాహి యాత్రలో ద్వారంపూడిపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. చంద్రబాబు తన పర్యటనల్లో కూడా ద్వారంపూడి వ్యవహారాన్ని దుయ్యబెట్టారు. దీంతో సిటీ నియోజకవర్గంలో ద్వారంపూడిని ఎలాగైనా ఓడించి కూటమి విజయం సాధించాలని భావిస్తోంది. టిడిపి నుంచి మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబుకే టిక్కెట్ దక్కుతుందనే అభిప్రాయాలు ఆ పార్టీ శ్రేణుల నుంచి విన్పిస్తుంది. ద్వారంపూడికి సరైన ప్రత్యర్థి కొండబాబే అనే అభిప్రాయాలు లేకపోలేదు. అయితే ఆయన ఆశించిన స్థాయిలో ప్రతిపక్ష పాత్ర పోషించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. సిటీ నియోజకవర్గంలో ఎంఎల్ఎ అరాచక పాలన సాగిస్తున్నారని, కనపడిన చోటల్లా భూ కబ్జాలు చేస్తున్నారని, పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులను కైవసం చేసుకుంటున్నారంటూ సందర్భం వచ్చినప్పుడల్లా కొండబాబు ఆరోపణలు చేస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ద్వారంపూడిని ఓడించాలంటే కొండబాబుకి ఇప్పుడున్న బలం సరిపోదనే సంకేతాలు టిడిపి అధిష్టానానికి చేరాయి. అందుచేతనే కాకినాడ జిల్లాలో కూటమి అభ్యర్థులు అందర్నీ ప్రకటించినప్పటికీ సిటీ నియోజకవర్గ అభ్యర్థిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. కొండబాబుకి కాకుండా ఆయన సోదరుడు కుమార్తె సుస్మితకు ఇస్తే ఎలా ఉంటుందని అంశంపై టిడిపి క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తుంది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి కూడా టికెట్ ఆశిస్తూ గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఆయన పెద్దాపురం టిక్కెట్లు కోరినప్పటికీ చంద్రబాబు మూడోసారి కూడా చిన్నరాజప్పనే ప్రకటించడంతో నిరాశ చెందారు. సిటీ నియోజకవర్గంలోనైనా టికెట్ కేటాయించాలని పట్టుదలతో ఆయన చేయని ప్రయత్నాలు లేవని ప్రచారం సాగుతోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో బిజెపి ఒక స్థానాన్ని కోరుతున్న నేపథ్యంలో కాకినాడ సిటీ నియోజకవర్గాన్ని తమకే ఇవ్వాలని పట్టు పడుతున్నట్లు సమాచారం. ఒకవేళ బిజెపికి గనుక అవకాశం ఇస్తే ఈ సీటును పోతులు విశ్వం, గట్టి సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ ముత్తా గోపాలకష్ణ కుమారుడు ముత్తా నవీన్ కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఎవరికి సీటు దక్కుతుందో, ఉమ్మడి అభ్యర్థి ఎవరనేది త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తుంది.